సీఎం జగన్‌తో గ్రామ స్వరాజ్య స్థాపన

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: మహాత్మా గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంగాదొడ్డి, కూరపర్తి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నాడు–నేడులో భాగంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలు అమలు చేస్తున్నామని, పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తుంటే.. ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. ఆదర్శంగా, పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్‌లు చిట్టెమ్మ, భాస్కర్, మునిభాస్కర్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శివారెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఆనంద, రమణ, రాయుడు, సురేష్ రెడ్డి, రవి, రఘు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

గుర్రంకొండ: రైతులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో రైతులకు కొత్తగా మంజూరైన వన్‌బీ, అడంగల్ కాపీలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్లుట్ల పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న రెవెన్యూ సమస్యలంటికి పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే గత కొద్దిరోజులు ఎల్లుట్ల గ్రామ రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీటీసీలు రాజగోపాల్, సింగంశెట్టి రెడ్డికుమార్, వీఆర్వో వెంకట్రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రహోత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం తీగల వారి బృందంచే తొలి గరుడ సేవ నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

బ్రహ్మంగారిమఠం.. శోభాయమానం

- నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు
- ఆరు రోజులపాటు నిర్వహణ
- పలు రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు



ఆలయం ముందు వేసిన పందిరి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీజగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది.

- శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి క్రీ.శ.1693నకు సరియగు శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధినిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి మే 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖులచే హరికథా కాలక్షేపం ఉంటుంది. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.
- స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన వైశాఖ శుద్ధ దశమి నాడైన ఈనెల 30న ప్రధాన ఘట్టం ఉంటుంది. దీక్షాబంధనాలంకారోత్సవంలో స్వామి యోగ నిద్రమూర్తియై భక్తులకు దర్శనమిస్తారు. మాలధారులు ఇరుముడి సమర్పిస్తారు. సాయంత్రం కందిమల్లయ్య పురసంస్థాన ఆస్థాన విద్వాంసులు నిగమాగమ కళాకోవిద మహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు ఉపన్యాసం ఉంటుంది. రాత్రి నంది వాహన గ్రామోత్సవం ఉంటుంది.


ఉత్సవ కార్యక్రమాల వివరాలు

మొదటి రోజు ఈనెల 27న రాత్రి శేష వాహనోత్సవం, 28న రాత్రి గజవాహనోత్సవం, 29న రాత్రి నరనంది ఉత్సవం, 30న మధ్యాహ్నం దీక్షాబంధనాలంకారోత్సవం, రాత్రి నంది ఉత్సవం, మే 1న సాయంత్రం బ్రహ్మరథోత్సవం, రాత్రి గజవాహనోత్సవం, మే 2న మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం ఉంటుంది.

పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినమైన వైశాఖ శుద్ధ దశమి నాడు (ఈనెల 30) అశేష సంఖ్యలో జనం వస్తారు. భక్తుల కోసం దేవాదాయశాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్య అన్నదాన పథకాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతుంది.

ఏర్పాట్లు పూర్తి



ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. సత్రాలు, అతిథి గృహాలతోపాటు తాత్కాలిక వసతులు కల్పిస్తున్నాం. అధికారులు, సిబ్బందికి భక్తులు సహకరించాలి. అందరం కలిసికట్టుగా ఉత్సవాలను విజవంతం చేయాలి.

– సి.శంకర్‌బాలాజీ, ఫిట్‌పర్సన్, వీరబ్రహ్మేంద్రస్వామి మఠం

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మదనపల్లె సిటీ: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని బెంగళూరు అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ హైమావతి అన్నారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఉమెన్ హెల్త్ హైజీన్‌పై లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు నిత్యం పని ఒత్తిడి కారణంగా ఆహార విషయంలో అశ్రద్ధ వహించడం వల్ల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. రక్తహీనత రోగనిరోధక శక్తి రోగ నిరోధకశక్తి తగ్గడండ సర్వైకల్ క్యాన్సర్ ప్రెగ్నెన్సీ సంబంధిత రుగ్మతలను వంటి మహిళల సమస్యల గురించి అవగాహన కల్పించారు. ఆదిత్య హాస్పిటల్ చీఫ్ కన్సలెంట్ డాక్టర్ దీపా మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలంటే కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ధృడంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలికిరిలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం



మహల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్

కలికిరి: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో మహల్ గ్రామ పంచాయతీలో ప్రచారం నిర్వహించి ఈ ప్రభుత్వంలో సౌకర్యవంతంగా అందుతున్న సంక్షేమ పథకాల గురించి విచారించారు. కలికిరి గ్రామ పంచాయతీ రాజువారిపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాలలో ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు కిరణ్, మహేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

వాల్మీకిపురం: అంతర పంటలు వేయడం వలన అధిక ఆదాయం పొందవచ్చునని రైతు సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి అధికారి ప్రకాష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తికి చెందిన శశిరేఖ ఏ గ్రేడ్ మోడల్‌ను, మంచూరుకు చెందిన నారాయణ రెడ్డి ఏ గ్రేడ్ మోడల్‌ను, నగిరిమడుగులో ఎల్లారెడ్డి, అయ్యవారిపల్లికి చెందిన హేమలత పొలాలను పరిశీలించారు. ప్రధాన పంటల్లో 30 రకాల విత్తనాలు అంతర పంటలు వేయడం జరిగిందన్నారు. ప్రకృతి సిబ్బంది శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య, రెడ్డిభాష, అనురాధ, రేణుక, స్వాతి, హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై తహసీల్దారుకు ఫిర్యాదు

కలికిరి: మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పరిధిలోని మల్లయ్యగుట్ట వద్ద కొందరు రియల్టర్లు మట్టితరలిస్తుండగా మల్‌రెడ్డిగారిపల్లి, బోడిరెడ్డిగారిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. మల్లయ్యగుట్టలో మల్లేశ్వరస్వామి ఆలయం వెలసివుందని, మట్టితరలించకూడదని అడ్డుకోవడంతో సమీపంలోని సన్యాసివారిపల్లికి చెందిన భూ యజమానులు తగాదాకు దిగారు. దీంతో మల్‌రెడ్డిగారిపల్లి, బోడిరెడ్డిగారిపల్లి గ్రామస్తులు తహసీల్దారు భాగ్యలతకు, పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పిలిచి విచారించిన తహసీల్దారు, పోలీసులు మట్టితరలింపుపై చర్యలు తీసుకుంటామన్నారు. గుట్టస్థలాన్ని సర్వే చేయనున్నట్లు హామీ ఇవ్వడంతో తగాదా సద్దుమనిగింది.

మదనపల్లెలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీ



పాప్‌కార్న్ ప్యాకెట్‌పై ధర, తూకం వివరాలు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

మదనపల్లె : పట్టణంలోని పలు దుకాణాలు, సినిమా థియేటర్ క్యాంటీన్‌లలో బుధవారం జిల్లా లీగల్ అండ్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక అప్పారావువీధి, బజారువీధి తదితర ప్రాంతాల్లో మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి తూకాల్లో వ్యత్యాసం, తక్కువ బరువు, ప్యాకెట్లపై ధరలు ముద్రించకపోవడం, తయారీదారుని చిరునామా లేకపోవడాన్ని గుర్తించారు. బియ్యం ప్యాకెట్లపై 24 కిలోలు ఉన్నట్లు ప్రింట్ చేసినప్పటికీ తూకం వేస్తే తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించారు. చక్కెర ప్యాకెట్లు, పప్పుధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులకు సంబంధించి ప్యాకెట్లపై తయారీదారుని పేరు, బరువు, ధర లేకపోవడం, హార్డ్‌వేర్ దుకాణాల్లో నిబంధనలు అతిక్రమించడాన్ని గుర్తించి 6 కేసులు నమోదు చేస్తూ.. రూ.46వేలు జరిమానా విధించారు. పట్టణంలోని సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో ఆహారపదార్థాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుపై మార్వారీవీధిలోని ఓ థియేటర్ క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపాటి పొట్లంలో పాప్‌కార్న్ రూ.40, ఆనియన్ రింగ్స్, చిప్స్ ప్యాకెట్లపై తయారీదారుడి పేరు, తూకానికి సంబంధించిన వివరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే సినిమా థియేటర్ క్యాంటీన్‌లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించినప్పటికీ కేసులు నమోదుచేయకుండా కేవలం సిబ్బందిని హెచ్చరించి విడిచిపెట్టారు. ఈ విషయమై లీగల్‌మెట్రాలజీ అధికారి నాగరాజును వివరణ కోరితే... డీసీ, ఉన్నతాధికారులకు విషయం తెలిపితే వారు మొదటిసారి కేవలం హెచ్చరించి వదిలేయమన్నారని, రెండోసారి తనిఖీల్లో పట్టుబడితే కేసు నమోదుచేయాల్సిందిగా చెప్పారని తెలిపారు.

కోడిపుంజుకోసం వెళ్లి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయచోటిటౌన్ : ఫ్రెండ్‌దగ్గర కోడి పుంజు కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద మస్తాన్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ట్రాఫిక్ ఎస్ఐ ఎస్‌ఎండీ రఫీ తెలిపారు. రాయచోటి పట్టణ పరిధిలోని పీటీఎం పల్లెకు చెందిన మదార్ సాహెబ్ మూడవ కుమారుడు సయ్యద్ మస్తాన్ వీరబల్లె మండల కేంద్రంలోని చాన్‌బాషకు ఫ్రెండ్ ఫ్రెండ్ దగ్గర కోడి పుంజు ఉందని తెలుసుకొని కోడి పుంజు కోసం వెళ్లాడు. అయితే వెళ్లే సమయానికి ఫ్రెండ్ లేకపోవడంతో తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మామిడి కాయలు కొనుగోలు చేసి స్కూటర్ స్టీరింగ్‌పై ఉంచుకొని వచ్చాడు. బండ్లోళ్ల మిట్ట రెండవ మలుపు వద్ద స్కూటర్ స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో రాళ్ల గుట్టను ఢీకొట్టాడు. ఈ దుర్ఘటనలో సయ్యద్ మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో చివరికి మానవత సేవా సంస్థ వారి వాహనం వచ్చి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన కలికిరి మండలంలో బుధవారం రాత్రి జరిగింది. మహాల్‌కు చెందిన మహ్మద్‌షరీఫ్ (46) తన తల్లి ముంతాజ్ బేగం (70), కుమారుడు నవాజ్ (14)తో కలిసి స్కూటీ లో నిమ్మనపల్లె మండలం ముస్తూరు గ్రామానికి వ్యక్తిగత పనులపై బయలుదేరారు. స్వగ్రామం మహాల్ దాటిన కొద్దిసేపటికే ద్విచక్రవాహనానికి పందులు అడ్డురావడంతో, స్కూటీ అదుపుతప్పి కిందపడడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి బాధితులను తరలించారు. పరీక్షించిన వైద్యులు మహ్మద్ షరీఫ్ తలకు తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం బాధితున్ని తిరుపతికి రెఫర్ చేశారు.

యువకుడిపై దాడి

మదనపల్లె : ఓ యువతిని ప్రేమించాడని యువకుడిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరచిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ మండెంవారిపల్లెకు చెందిన మస్తాన్‌రెడ్డి (25) స్థానికంగా ఉన్న ఓ యువతిని ప్రేమించాడు. ఆ విషయం సదరు యువతి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో రాత్రి మస్తాన్‌రెడ్డి ఒంటరిగా గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో కాపుకాసి యువతి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దాడిలో బాధితుడి చేయి నరకడంతో తీవ్రగాయమైంది. వారి నుంచి చాకచక్యంగా త ప్పించుకున్న బాధితుడు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

మదనపల్లె : రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. వివరాలు... కేరళ రాష్ట్రానికి చెందిన వి.వేలాయుధం (75) కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా స్థిర నివాసం ఏర్పరచుకుని టీ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం అంగళ్లులో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో వేలాయుధం తీవ్రంగా గాయపడటంతో గమనించిన స్థానికులు బాధితున్ని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందాడు. ముదివేడు పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామానికి చెందిన చంద్రశేఖర్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య తనపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టడంతో మనస్తాపం చెంది బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా పట్టణంలోని అనపగుట్టకు చెందిన ఇంతియాజ్ (27) పెయింటర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. అయితే ఇటీవల భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన రవీంద్ర (20)చేనేత కార్మికునిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గులికల మందు తిని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బాధితుల్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8వవార్డు టీడీపీ కౌన్సిలర్ రాజీనామా

మదనపల్లె : మున్సిపాలిటీలోని 8వవార్డు టీడీపీ కౌన్సిలర్ బి.గీతశ్రీ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కే.ప్రమీలను కలిసి రాజీనామా సమర్పించారు. డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాతికేళ్ల తర్వాత ఉద్యోగావకాశాలు కల్పించడంతో అందులో టీడీపీ కౌన్సిలర్ బి.గీతశ్రీకి టీచర్ ఉద్యోగం లభించింది. నిమ్మనపల్లె మండలం బోడుమల్లయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా నియామక ఉత్తర్వులు పొందారు. ఆమె ఉద్యోగంలో మినిమం టైమ్ స్కేల్ కింద నెలకు రూ.32,670 వేతనం అందుకుంటారు.

దాతల దాతృత్వం మరువలేనిది



కోన ఉన్నత పాఠశాలకు బెంచ్‌లు, టీవీ వితరణ చేస్తున్న హెచ్‌పీసీఎల్ ఏరియా ఆఫీసర్ పుల్లయ్య

కలకడ : దాతల దాతృత్వం మరువలేనిదని హెచ్ఎం పార్వతమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కోన జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు హెచ్‌పీసీఎల్ (హిందూస్తాన్‌పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) విజయవాడ–ధర్మపురి పైప్‌లైన్ కోన పంప్ సెట్ ఏరియా ఆఫీసర్ ఇ.పుల్లయ్య వారి కంపెనీ ఉన్నతాధికారులతో సంప్రదించి రూ. 4 లక్షలు విలువచేసే 30 డెస్క్‌లు, 8 ర్యాక్‌ల కబోర్డ్, 2 టీవీలు వితరణ చేశారు. ఈసందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రిలు, పేదలకు ఉపయోగపడే సంస్థల అభివృద్ధికి సాయం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు పైప్‌లైన్ లీకేజీల ద్వారా పంటలు నష్టపోకుండా చూడాలని రైతులు కోరారు. స్పందించిన ఏరియ మేనుజర్ పైప్‌లైన్ వలన రైతులకు ఎలాంటి నష్టం వాటిళ్ళకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కంపెనీ డిప్యూటీ మేనేజర్ సాయిమహేష్, ఫీల్డ్ సిబ్బంది నవీన్‌లోకేష్, నడిమిచెర్ల ఉన్నతపాఠశాల హెచ్‌ఎం శంకరయ్య, పాఠశాల అభివృద్ధికమిటీ సభ్యులు హరినాథరెడ్డి, మాధవరెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల సత్తా

నిమ్మనపల్లె : ఇంటర్మీడియట్ 2023 పరీక్ష ఫలితాల్లో మండల ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులు 62 మంది పరీక్షలకు హాజరుకాగా 44 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సర విద్యార్థులు 70 మంది హాజరవ్వగా 32 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే మోడల్‌స్కూల్ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 55 మంది హాజరవ్వగా 44 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 64 మంది హాజరవ్వగా 42 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఏపీ మోడల్ స్కూల్ రెడ్డివారిపల్లె విద్యార్థి మదనపల్లెకు చెందిన పఠాన్‌మహ్మద్‌షాహీద్‌ఖాన్ బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగానూ 973 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి కృషి

– ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

పీలేరురూరల్ : ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలలో అపుస్మా అసోసియేషన్ ఆధ్వర్యంలో పీలేరు, మదనపల్లె ప్రైవేట్ విద్యా సంస్థల కరస్పాండెంట్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ స్కూల్ యాజమాన్యం ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావలన్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

మదనపల్లె : అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన సామాజిక విప్లవకారుడు, బీసీల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ప్రతిష్టించుకునేందుకు పట్టణంలో అనువైన స్థలం కేటాయించాల్సిందిగా పూలే విగ్రహ ప్రతిష్ట కమిటీ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కే.ప్రమీలను బీసీ సంఘాల నాయకులు కలుసుకుని స్థల కేటాయింపుపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులాలకు జ్యోతిరావుపూలే దంపతులు చేసిన సేవలు విలువైనవని, వారిని జీవితాంతం స్మరించుకునేందుకు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపుకునేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. పాల ఏకరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్నేరాజేంద్ర, చంద్ర, వాల్మీకి పాదలనరసింహులు, ఆర్.శ్రీనివాసులు, సగర ఉప్పర సంఘం కే.గంగులప్ప, రజకసంఘం రెడ్డెప్ప, సిద్ధేశ్వర, నాయీబ్రాహ్మణ సుబ్రహ్మణ్యం, రెడ్డికిరణ్, కురబసంఘం కే.వేణుగోపాల్ కృష్ణమూర్తి, చేనేతకార్మికసంఘం నాగరాజ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయానికి మహర్దశ

- రూ.1.56 కోట్లతో పనులకు శ్రీకారం
- జీర్ణోద్ధరణ పనులకు ఎమ్మెల్యే ద్వారనాథరెడ్డి భూమి పూజ



ఆలయ జీర్ణోద్ధరణ భూమి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ములకలచెరువు: మండలంలోని పాతములకల చెరువులో వెలసిన 500 ఏళ్లనాటి శ్రీ ప్రసన్న మల్లికార్జునస్వామి ఆలయానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కృషితో రూ.1.56 కోట్లతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన ఆలయాలు గతానికి, గత చరిత్రకు సాక్ష్యాలన్నారు. ప్రజల భక్తి విశ్వాసాలతో ముడిపడిన ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా చరిత్ర శిథిలం కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. తన వంతు కృషిగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పురాతన ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయి లీలా, జెడ్పీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, మాధవ రెడ్డి, సర్పంచులు మంజులా, రహమత్‌బీ, జయచంద్ర, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి, సిద్దారెడ్డి, మాజీ సర్పంచు రవీంద్రారెడ్డి, ఎంపీటీసీలు రేష్మా, ఆయిషా, నాయకులు, జనార్థన్‌రెడ్డి, విశ్వనాథ్, సుందర్‌రాజు, కిషోర్, రామనాథం, చాంద్‌బాషా పాల్గొన్నారు.

అందరి సహకారంతో మల్లయ్యకొండ ఆలయ అభివృద్ధి

తంబళ్లపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ ఆలయ అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మల్లయ్యకొండ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప,మల్లికార్జునలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు దర్శనంకల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మల్‌రెడ్డి, ఈవోరమణ, ఆలయ ధర్మకర్తలు పూజారులతో ఆలయ అభివృద్ధిపై చర్చించారు.





నిరుపేదకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీ బురుజుపల్లికి చెందిన వెంకట్రమణ వాటర్‌మెన్‌గా పని చేసేవాడు. కొద్ది రోజుల క్రితం అతడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ఇచ్చిన రూ.11 వేల నగదును బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మెకానిక్ చంద్ర, సర్పంచ్ రామాంజులు, రఘు, మాబూ సాబ్, నారాయణస్వామిలు మృతుడి భార్య రెడ్డెమ్మకు అందజేశారు.

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

పీలేరు : పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలని ఏఎంసీ ఛైర్మన్ చంద్రగిరి యల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం స్థానిక ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, నాయకులు ఉదయ్‌కుమార్, ఆనంద్, షాకీర్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



29న ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

మదనపల్లె సిటీ: ఉమ్మడి చిత్తూరు రీజియన్ పరిధిలోని ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు సంబంధించి తిరుపతిలో 29న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు 1.1.2016 నుంచి 31.12.2019 వరకు పని చేసి చనిపోయిన వారి వారసులకు కారుణ్య నియామకాల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగుల వారసులు సర్టిఫికెట్లను తిరుపతి, ప్రజా రవాణాధికారి కార్యాలయంకు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని కోరారు.









